


# విశేష ఖడ్గం

- ప్రతాప వెంకట సుబ్బారాయుడు, సికింద్రాబాద్

కళ్యాణ నగరాన్ని పరిపాలించే మహారాజు విక్రమసేనుడు అంటే ఇతర రాజ్యాల రాజులకి సింహస్వప్నం. కళ్యాణ నగరంపై యుద్ధం మాట అటుంచి ఆ మాట తల్చుకోడానికి సైతం భయపడిపోతారు. దానికి కారణం కేవలం మహారాజు మాత్రమే కాదు. ఆయన సేనా నాయకుడు మార్కండేయుడు. ఆయన దగ్గర వంశపారంపర్యంగా సంప్రాప్తించిన విశేషఖడ్గం ఉంది. అది అతని ముత్తాతలకి కాళికాదేవి కానుకగా ఇచ్చిందని చెబుతారు. అది పట్టుకుని మార్కండేయుడు పోరులో నిలిచాడంటే సాక్షాత్తు వీరభద్రుడే. ఆ ధాటికి శత్రుసైన్యం తుత్తునియులు అయేది. అందుకని కళ్యాణ నగరం వంక శత్రురాజులు చూసే సాహసం చేసేవారు కాదు.

ఒకసారి మార్కండేయుడు తన కొడుకు అజేయుడిని పిలిచి - నాయనా వివిధ ప్రాంతాల్లో ఉన్న మన బంధువర్గాన్ని చూసి చాలా కాలమ యింది. రాచకార్యంలో పడి సమయం కేటాయించలేక పోయానిన్నాళ్ళు. ఇప్పుడు యువకులకి యుద్ధకార్యకలాపాల

శిక్షణ పూర్తయింది. దేశం ప్రశాంతంగా వుంది. అందుకని నువ్వు ఈ దేశానికి కాబోయే సేనానాయకుడివి కాబట్టి తాత్కాలికంగా నా బాధ్యత నీ భుజస్కందాలపై పెట్టి బంధుమిత్రుల ఇళ్ళకు వెళ్ళివస్తాను. రాజ్యం జాగ్రత్త" అని కొడుక్కి బాధ్యతలు అప్పగించి వెళ్ళిపోయాడు.

ఆర్నెళ్ళ తరువాత వచ్చిన మార్కండేయుడికి రాజ్య సైనిక పటాలాల్లో అస్తవ్యస్త పరిస్థితులు కనిపించాయి. యువత సైనిక శిబిరాల్లో నిర్లక్ష్యపూరితంగా కనిపించారు. ఆ పరిస్థితులకు ఉగ్రుడై కొడుకుని పిలిచి 'సైనిక పరిస్థితి ఇంతగా దిగజారిందేమిటి? రేపన్న రోజు హఠాత్తుగా యుద్ధం వస్తే ఏం చేస్తావు?" అని అడిగాడు.

దానికి అజేయుడు "నాన్నా, మన దగ్గర విశేష ఖడ్గం వుంది.. అది శత్రువుల కుత్తుకలు కోస్తుంది. అది వుండగా మనకి చింత ఎందుకు?" అన్నాడు.

"ఓరి మూర్ఖా.. ఆ ఖడ్గాన్ని ఉపయోగించే శక్తిసామర్థ్యాలు మనకుండాలి కదా! నిత్యం మనం శారీరకంగా పరిశ్రమిస్తుంటే దానికి ఆ విశేషఖడ్గ శక్తి తోడవుతుంది. అంతేకాని నిర్వీర్యమైన సైనికులతో యుద్ధం ఎలా చేయగలం? శత్రురాజుల్ని, సైనికుల్ని బెంబేలెత్తిస్తున్నది నిజానికి కత్తికాదు మన శక్తి. అది ఖడ్గం అంతర్ రూపం. అది గ్రహించు" అన్నాడు.

"నేను ఎంత తెలివి తక్కువ పని చేశానోఅర్థమయింది నాన్నగారు. ఇహనుండి ఆ విశేష ఖడ్గాన్ని ఉపయోగించచకుండానే శత్రుదేశాల భరతంపడతా, మన దేశంలోని ప్రతి యువకుడిని బలమైన సైనికుడిగా తీర్చిదిద్దుతా'' అన్నాడు పశ్చాత్తాపంతో అజేయుడు.

"భేష్! ఇహ ఈ దేశం వంక ఎవ్వరూ కన్నెత్తి చూడలేరన్న నమ్మకం కలిగించావు'' అని అజేయుడిని దగ్గరకు తీసుకుని మనసారా అభినందించాడు మార్కండేయుడు.